క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం

మంగళగిరి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రునికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహాయం అందించారు. వివరాలు.. దుగ్గిరాల మండలం శృంగారపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కనపాల ప్రకాష్ రోడ్డు ప్రమాదంతో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ చేయాలని వైద్యులు నిర్ధారించారు. దీంతో ప్రకాష్ ఆర్థిక పరిస్థితిని గురించి స్థానిక పార్టీ నేతలు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే, ప్రకాష్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.22 వేలను తన కార్యాలయ సిబ్బంది ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

దుగ్గిరాల ఎస్‌ఐగా మహేంద్ర



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా మహేంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మంగళగిరి రూరల్‌లో పనిచేసిన మహేంద్ర బదిలీపై దుగ్గిరాలకు వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన ఆయన్ను సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ పరిధిలోని ఇప్పటంలో ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను శనివారం తెల్లవారుజామున ఎస్‌ఐ రమేష్ స్వాధీనం చేసుకున్నారు. చిర్రావూరు కృష్ణానదిలో నిషేధిత ఇసుక క్వారీ నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మొబైల్ వాహనంపై మద్యం అమ్మకాలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మొబైల్ వాహనంపై తిరుగుతూ మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను తాడేపల్లి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు.. గుండిమెడకు చెందిన కారుమంచి మేరిజ్యోతి తన ద్విచక్ర వాహనం స్కూటీలో 20 క్వార్టర్ మద్యం బాటిళ్లు పెట్టుకుని కనకదుర్గ వారధి కరకట్టపై చిర్రావూరు దగ్గర ద్విచక్ర వాహనంలో అటూ ఇటూ తిరుగుతూ ఆ రహదారిలో ప్రయాణించే వారికి మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేశామని, వాహనంలో 20 క్వార్టర్ బాటిళ్లు లభించడంతో ఆమెపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా గౌరవ న్యాయమూర్తి ఆమెను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో శ్రీనివాస హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



మేడికొండూరు: మండల పరిధిలోని మందపాడు గ్రామానికి చెందిన శ్రీనివాస హైస్కూల్ విద్యార్థులు షూటింగ్ బాల్‌లో ప్రతిభ కనబర్చారు. జనవరి 26, 27, 28 తేదీల్లో మహారాష్ట్రలో నిర్వహించిన జాతీయ సీనియర్ షూటింగ్‌బాల్ క్రీడా పోటీల్లో పాఠశాలకు చెందిన ప్రియదర్శిని, సరిత మూడో స్థానం సాధించారు. బాపట్ల జిల్లా చీరాలలో జనవరి 31న, ఫిబ్రవరి 1న నిర్వహించిన జాతీయ స్థాయి జూనియర్ షూటింగ్‌బాల్‌లో 8వ తరగతి చదువుతున్న ప్రియదర్శిని, అక్షయ, సరిత, మంజూషలు మూడో స్థానం సాధించి పాఠశాల పేరు నిలబెట్టారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి, విద్యాశాఖ ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి అభినందించారు. పాఠశాల చైర్మన్ నాగేశ్వరరావు, గౌతమి, ప్రిన్సిపాల్ కరీముల్లా పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర కీలకం

ఏఎన్‌యూ: పేదలు, నిర్లక్ష్యానికి గురైన వృద్ధులు, బాల కార్మికులు, రోగులు, అణగారిన వర్గాలకు సేవలు అందించడంలో ఎన్జీవోల పాత్ర కీలకమని రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి అన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో 'నెట్‌వర్కింగ్ అండ్ ఇంటర్‌ఫేసింగ్ ఆఫ్ నాన్- గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ ఫర్ కన్వర్జెన్స్ ఇన్ సోషల్ యాక్షన్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. వరప్రసాద మూర్తి మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక, సంప్రదాయం, సంస్కృతి వంటి కీలక అంశాలను ప్రజలకు చేరువ చేయడంలో ఎన్జీవోల ప్రతినిధులు నిరంతరాయంగా పనిచేస్తున్నారని కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ సోషల్ సైన్స్ డీన్ ఆచార్య జి.వి.రమణ మాట్లాడుతూ ఎన్జీవోలపై ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ఉండాలని సూచించారు. గోవా కి చెందిన జాగ్రఫీ అధ్యాపకులు డాక్టర్ రత్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు విద్యా పరిశోధన అంశాలపై దృష్టి సారించాలని చెప్పారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్సిటీ చరిత్రలో ఎన్జీవోలపై జాతీయ సదస్సు నిర్వహణ ఇదే ప్రథమం అన్నారు. సదస్సులో చేపట్టిన తీర్మానాల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తామని చెప్పారు. అనంతరం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సోషల్ సైన్స్ డీన్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు సదస్సు నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో ఆచార్య కె. ధనలక్ష్మి, డాక్టర్ రాజకుమార్, డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులను ప్రోత్సహించేందుకే కాంప్లెక్స్‌లు

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి
- బాబూ జగ్జీవన్‌రామ్ చర్మకారుల భవనం ప్రారంభం
- చర్మకారుల అభివృద్ధి కోసమే విలువైన స్థలం కేటాయింపు
- ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మురుగుడు



షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: చేతి వృత్తిదారులను ప్రోత్సహించేందుకే కాంప్లెక్స్‌లు నిర్మాణం చేపట్టినట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని పాత జాతీయ రహదారి వెంబడి ఐటీసీ వద్ద నిర్మించిన బాబూ జగ్జీవన్‌రామ్ చర్మకారుల భవనం, ఆయన విగ్రహాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, చర్మకార చేతివృత్తిదారుల సంఘం నాయకులు బుల్లా సారమ్మ, చర్మకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావుతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆర్కే మాట్లాడుతూ ఇప్పటికి కూడా చాలామంది పాదరక్షలు కుట్టుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. ఆ వృత్తిలో ఉన్నవారు కార్పొరేషన్ పరిధిలో పలుచోట్ల ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పొట్టపోసుకుంటున్నారని, అలాంటి వారి కోసం పాత జాతీయ రహదారి వెంబడి కోట్ల విలువ చేసే స్థలాన్ని కేటాయించి, ప్రస్తుతం రూ.75 లక్షలతో పది షాపుల నిర్మాణం చేపట్టామని వివరించారు. రానున్న కాలంలో కార్పొరేషన్ నిధులు కేటాయించి మరో పది షాపుల నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ మురుగుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి తగిన విధంగా సాయం అందిస్తున్నట్లు వివరించారు. చేతి వృత్తుల వారిని ప్రోత్సహించే విధంగా ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, జేసీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణఎస్సీ ఎస్టీ, బీసీ యూత్ సేవాదళ్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బాలసాని అనిల్, బి.దాసు, టి.మహేష్‌రెడ్డి, కె.రమేష్, తాడేపల్లి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, ఎండీ గోరేబాబు, మాచర్ల అబ్బు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.వెంకటరామిరెడ్డి, వి.కళ్యాణ్, దర్శి రమేష్, రొడ్డ ఎలీషా, అమృత రావు, సుబ్బు, బేతపూడి నరసయ్య, ఈపూరి ఆదాం, రాంబాబు, దుగ్గిరాల మండలం, తాడేపల్లి మండల, మంగళగిరి రూరల్ దళిత సంఘ నాయకులు, చేతి వృత్తిదారులు, డప్పు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

రజక, పద్మశాలి కమ్యూనిటీ హాల్స్ ప్రారంభం

మంగళగిరి: నగరంలోని రాజీవ్ గృహకల్ప సమీపంలో నూతనంగా నిర్మించిన రజక, పద్మశాలి కమ్యూనిటీ హాల్స్‌ను శనివారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు రూ.2కోట్ల నిధులతో రజక, పద్మశాలి కమ్యూనిటీ హాల్స్‌ను నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, ఎండీ ఇక్బాల్ అహ్మద్, కుంచాల కృష్ణ కిషోర్ పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన పెంచుకోవాలి

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్



తాడేపల్లిరూరల్: న్యాయ శాస్త్రానికి సమాజానికి అంతర్గత సంబంధం ఉందని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ఆధ్వర్యంలో ప్రోబోన్ క్లబ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రాథమిక హక్కులు పుట్టినప్పటి నుంచి మనకు ఉన్నాగాని, అవి రాజ్యాంగంలో పొందుపరిచిన తరువాతే తప్పని సరి చేయబడ్డాయన్నారు. కళాశాల విద్యార్థులు న్యాయ శాస్త్రాల, సమాజంపై అవగాహన పెంచుకోవాలన్నారు. వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ప్రజలక న్యాయ సేవలను అందించాలనే ఉద్దేశంతో ప్రోబోన్ క్లబ్‌ను స్థాపించినట్లు వివరించారు. ఈ క్లబ్ ద్వారా సాధారణ ప్రజలకు న్యాయం గురించి, చట్టాల గురించి అవగాహన కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని సాధారణ ప్రజలకు న్యాయ సేవలను అందిస్తామని అన్నారు. అనంతరం జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.బి.సుందర్, గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.సురేష్, కేంద్ర న్యాయ శాఖ ప్రోగ్రాం మేనేజర్ స్నేహశర్మ, కేఎల్‌యూ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, కేఎల్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పవన్‌కుమార్, విభాగాధిపతి విజయసుధ, ఆచార్యులు డాక్టర్ కామసాయి, అసిస్టెంట్ ఆచార్యులు ఆర్.చాందిని పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త లావణ్యకు అభినందనలు



మురుగుడు లావణ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్తగా నియమితులైన మురుగుడు లావణ్యను శనివారం నగరంలోని ఆమె నివాసంలో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆకురాతి రాజేష్ ఎండీ ఫిరోజ్, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, బెజ్జం రాజాజీ, తోట శ్రీనివాసరావు, కలకోటి స్వరూపరాణి, కుంచాల కృష్ణ కిషోర్ ఉన్నారు. అదే విధంగా విజయవాడ దుర్గ గుడి ప్రత్యేక ఆహ్వాన కమిటీ సభ్యులు జెక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల ఉన్నారు. తొలుత ఆమె నగరంలోని మిద్దె సెంటర్ శ్రీబాల గణపతి దేవాలయంలో లావణ్య, సత్యం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోలి లింగయ్య రామాలయం, శ్రీ ప్రపత్తి ఆంజనేయ స్వామి వారి దేవస్థానం, గణపతినగర్‌లోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు.

సృజనాత్మకతతో కూడిన విద్య అవసరం

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: విద్యార్థులు విద్యతో పాటు సృజనాత్మకత పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగరంలోని హీరా ఇస్లామిక్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను శనివారం ప్రారంభించారు. సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించి విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. ప్రపంచానికి ఎందరో శాస్త్రవేత్తలను అందించిన ఘనత భారతదేశానికే దక్కుతోందన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఇటువంటి సైన్స్ ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేయడం ద్వారా వారిలో సృజనాత్మకత పెరుగుతుందని పేర్కొన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్‌ల ద్వారా విద్యార్థుల్లో ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన వస్తుందని, వారిలో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని వివరించారు. విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు ఆలీబాషా ఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఇక్బాల్ అహ్మద్, ఎండీ ఫిరోజ్, బేతపూడి నర్సయ్య, కిషోర్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ జోన్ సందర్శన



మంగళగిరి: నగరంలోని తెనాలి రోడ్డులో ప్రారంభోత్సవానికి సిద్ధమైన దివంగత గుమ్మడి పుల్లేశ్వరరావు పవర్ లిఫ్టింగ్ జోన్‌ను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం సందర్శించారు. పవర్ లిఫ్టింగ్ జోన్‌లోని క్రీడా వేదికకు మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ సాదియా అల్మాస్ పేరు, క్రీడా ప్రాంగణానికి దివంగత గుమ్మడి పుల్లేశ్వరరావు పేరు పెట్టాలని నిర్ణయించడం ఎంతైనా అభినందనీయమని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయ్‌భాస్కర్ కొనియాడారు. పవర్ లిఫ్టింగ్ జోన్ నిర్మాణం చేయడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ సంధానీ, ట్రెజరర్ గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.భాస్కరరావు, బొల్లినేని చంద్రిక, జాయింట్ సెక్రటరీలు ఘట్టమనేని సాయి రేవతి, ఎస్‌డీ మస్తాన్ వలి, సభ్యులు ఆళ్ల పవన్‌కుమార్, షేక్ సుభానీ పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లు, రూట్‌ను పరిశీలించాలి

తాడికొండ: ఎన్నికల విధులలో భాగంగా కేటాయించిన రూట్‌లకు సంబంధించిన సెక్టార్ ఆఫీసర్‌లు వారి పరిధిలోని పోలింగ్ బూత్‌లు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నీచర్, ర్యాంపు ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు శనివారం తెలిపారు. పలు పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించారు.

పెదపరిమి- వైకుంఠపురం రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

వడ్డమాను(తాడికొండ): సంక్షేమం, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకతోటి సుచరిత పేర్కొన్నారు. తుళ్లూరు మండలం పెదపరిమి నుంచి అమరావతి మండలం వైకుంఠపురం వరకు రూ.6 కోట్లతో నిర్మించనున్న రహదారికి శనివారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాల వరకు నాయకులు, కార్యకర్తలతో కలసి ర్యాలీ నిర్వహించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతవరంలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని పరిశీలించి మేరీమాత ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, తుళ్ళూరు, పెదపరిమి సొసైటీ అధ్యక్షులు మున్నంగి కోటిరెడ్డి, నాయుడు నాగేశ్వరరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ మేకల రవికుమార్, మాజీ ఎంపీపీ వల్లంరెడ్డి శ్రీ మహాలక్ష్మీ, పార్టీ గ్రామ అధ్యక్షుడు గొట్టం వెంకట నర్సింహా రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు చుండు వెంకటరెడ్డి, మేళం వెంకటేశ్వరరావు, టి.రమణారెడ్డి, ఎస్.సందీప్, ఎ.సురేష్, జోజి, బండ్ల శ్రీకాంత్, బి.కిషోర్, కె.దత్తు, ఐ.చంటి పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఎమ్మెల్యే ఆర్కే



బాలికల విభాగం క్రికెట్‌లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులతో ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: బాల్యంలో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, 10వ తరగతి విద్యార్థుల గెట్ టుగెదర్ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించి, ఆడుదాం ఆంధ్రాలో వివిధ క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. నాడు- నేడు కింద కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దారని చెప్పారు. ప్రపంచ దేశాల విద్యార్థులతో పోటీ పడే విధంగా ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టి, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారని, కంప్యూటర్‌పై పట్టు సాధించేందుకు ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారని తెలిపారు. రానున్న కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో మార్పులు తీసుకువస్తారని, పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు ఒక వరమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూర్ణచంద్రరావు, పీఈటీ రమేష్, విద్యాకమిటీ చైర్మన్ షేక్ సుభాని, వైఎస్సార్ సీపీ పెనుమాక అధ్యక్షుడు మేకా దామేశ్వర్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు శివారెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకుడు బొక్కా ప్రసన్న (నాని)తో పాటు భవనం రవీంద్ర రెడ్డి, అంజిరెడ్డి, సుమంత్ రెడ్డి, పులి భుజంగరావు, షేక్ బషీర్ పాల్గొన్నారు.

కేఎల్‌యూలో జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శన



కేఎల్‌యూలో ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శన

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో శనివారం ఇండియా ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయవాడ విమానాశ్రయ డైరెక్టర్ మల్లకంటి లక్ష్మీకాంత్ రెడ్డి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ మనకు ఉన్న 64 కళలలో చిత్రలేఖనం కూడా ఒకటి అని, ప్రస్తుతం చిత్రలేఖనంలో విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారని అన్నారు. యూనివర్సిటీ డ్రీమ్ వర్క్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ పి. రమేష్ మాట్లాడుతూ అనంత్ డైమండ్స్, డ్రీమ్ వర్క్ ఆర్ట్ గ్యాలరీ సంస్థల సహకారంతో చిత్రకళా వస్తు ప్రదర్శన నిర్వహించామని అన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ చిత్రకళా వస్తు ప్రదర్శనకు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన చిత్రకారులు పాల్గొని తాము వేసిన చిత్రకళలను ప్రదర్శించారురు. జాతీయ స్థాయిలో పేరుపొందిన చిత్రకారులు గీసిన చిత్రాలు ప్రదర్శనతో పాటు చిత్రలేఖనంలో జాతీయస్థాయిలో అవార్డులు పొందిన చిత్రకారుల్లో నైపుణ్యాలు పెంపొందడానికి ఇదిఒక అవకాశమని అన్నారు. అనంతరం అత్యంత ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, ఏసీ ఐసీ కేఎల్ స్టార్టప్ సీఈఓ రమాకాంత్, కేఎల్‌టీఎఫ్ సి.ఇ.వో. అలోక్ గోవిల్ పాల్గొన్నారు.

దుగ్గిరాల- ఈమని రోడ్డుకు మహర్దశ





దుగ్గిరాల - ఈమని రోడ్డు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

ఎమ్మెల్యే సొంత నిధులు రూ.6 లక్షలతో పనులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల- ఈమని రోడ్డుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో మరమ్మతులు చేపట్టారు. రహదారి ఇరువైపులా కాలువ ఉండడంతో రహదారి కుంగిపోయి పలుచోట్ల గోతులు పడడంతో ఈమని ప్రజలతో పాటు పలు ప్రాంతాల ప్రజలు దుగ్గిరాల రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన 24 గంటల్లో రహదారి మరమ్మతులు చేయిస్తానని వారికి హామీ ఇచ్చి శనివారం పనులు ప్రారంభించారు. దుగ్గిరాల నుంచి ఈమని శివారు వరకు మూడు కిలో మీటర్ల పొడవున రోడ్డుకు ఇరువైపులా వెటమిక్స్‌తో మార్జిన్ ఏర్పాటు చేసి, గోతులు పడిన చోట వాటిని పూడ్చి బీటీ రోడ్ ఏర్పాటు చేశారు. రహదారి మరమ్మతులు చేయడంపై ఈమని వైఎస్సార్ సీపీ నాయకులతో పాటు, ఆ రహదారిలో రాకపోకలు సాగించే ప్రజలు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి..

మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కేకు టాయిలెట్ల్ నిర్మాణం చేపట్టాలని కోరడంతో స్పందించిన ఆయన లక్షా 50 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించి అందజేసి, వెంటనే టాయ్‌లెట్ల నిర్మాణ పనులు విద్యాకమిటీ చైర్మన్ సుభానికి సూచించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పలుకూరి సామ్యేలు సోదరుడు సాంబయ్య శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సాంబయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి పలుకూరి మేరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు వి. రజనీకాంత్, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఎస్.రత్నం, బీసీ సెల్ నాయకులు డి.వెంకటేశ్వరరావు, షేక్ జానీబాషా, పిల్లి ధర్మ రత్నం ఉన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ

తాడేపల్లిరూరల్: పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. తొలుత విద్యార్థులు, ఏఎన్ఎంతో కలసి అవగాహన కల్పించారు. హెచ్ఎం జి. సుబ్బారావు మాట్లాడుతూ 0–5 సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పని సరిగా పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఆదివారం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, తల్లిదండ్రులు తప్పని సరిగా 0–5 సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కాకుమాను జోజప్ప, రామచంద్రారెడ్డి, ఏఎన్ఎంలు పి.శ్యామలాదేవి, జి.రాధిక, ఎం.రాజారత్నం, ఎ.పుణ్యవతి, ఎం.అన్నమ్మ, పి.మాణిక్యం, ఎస్.లక్ష్మి తిరుపతమ్మ, కె. ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో చుక్కలు పంపిణీని విజయవంతం చేయాలని వైద్యాధికారులు కోరారు. ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి ఎస్తేరురాణి మాట్లాడుతూ చిన్నారులకు పోలియోచుక్కలు వేయించడం ద్వారా పోలియోమహమ్మారిని తరిమి కొట్టవచ్చని అన్నారు. అనంతరం ఆరోగ్యసిబ్బందితో గ్రామంలోర్యాలీ నిర్వహించారు. మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీ పరిధిలోని కండ్రిక , బేతపూడి, నుదురుపాడు, ఫిరంగిపురం పీహెచ్‌సీలను జిల్లా ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం అధికారి శ్రావణ్‌బాబు పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారులు ఫరీనాబేగం, యానీగ్రేస్, ఎస్తేరురాణి, శ్వేత,, సీహెచ్‌వోలు వెంకటలక్ష్మి, వెంకటరమణ, పీహెచ్ఎన్ గాయత్రీదేవి, హెచ్ఎస్ సుదర్శన్‌రాజు ఉన్నారు.

ఉండవల్లిలో చైన్‌స్నాచింగ్



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి గుంటూరు చానల్ కరకట్టపై శనివారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. ఉండవల్లికి చెందిన దుర్గా పద్మ కిరాణాషాపునకు వెళ్లి కరకట్ట మీదుగా ఇంటికి వెళుతుండగా, ఎదురుగా ఇద్దరు యువకులు వచ్చి ఆమె మెడలోని నాన్‌తాడు తెంచే ప్రయత్నం చేయగా, దుర్గా ప్రతిఘటించింది. ఆమె మెడలో ఉన్న బంగారం నాన్‌తాడు సగం లాక్కొని ద్విచక్రవాహనంపై గుంటూరు చానల్ బ్రిడ్జి మీదుగా ఉండవల్లి అమరావతి రోడ్డులోకి వెళ్లారు. సమాచారం తెలుసుకున్న తాడేపల్లి సీఐ మధుసూదనరావు ఘటనా స్థలానికి వెళ్లి బాధితురాలిని నుంచి వివరాలు సేకరించారు. ఉండవల్లి, పోలకంపాడు, ఉండవల్లి సెంటర్, తదితర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేశారు.